
సాక్షి
ఒడిశా

ఆదివారం । 11 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.1,29,791లు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



బొరిగుమ్మలో త్రినాథ మందిరం ప్రతిష్ట

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ పోలీసు స్టేషన్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన త్రినాథ మందిర ప్రతిష్టోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. పోలీసు అధికారి క్షీరేశ్వర సాహు,ఆయన సతీమణి అలకానంద సాహు ప్రధాన కర్తలుగా వ్యవహరించారు.



పోలీస్ బీట్ హౌస్ ప్రారంభం

జయపురం: ఛత్తీస్‌గఢ్-ఒడిశా రాష్ట్రాల సరిహద్దు కొట్‌పాడ్ పోలీస్ స్టేషన్ పరిధి చందిలి గ్రామంలో పోలీస్ బీట్ హౌస్‌ను డీఐజీ చరణ్‌సింగ్ మినా శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు.

న్యూస్‌రీల్

రథాల తయారీని పర్యవేక్షించిన ఎమ్మెల్యే



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరావు

పర్లాకిమిడి: రథాయాత్ర సమీపిస్తున్న తరుణంలో రథాల తయారీ పనులను పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు ఆదివారం సాయంత్రం పర్యవేక్షించారు. ఆయన తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత పర్లాకిమిడిలో మూడు రథాలు తయారు చేసి, రథయాత్రను ప్రతిపాదించారు. అదే పద్ధతి ఇప్పటి వరకూ కొనసాగిస్తున్నారు. పర్లాకిమిడి మహారాజా కృష్ణచంద్ర గజపతి నారాయణదేవ్ హయాంలో సుభద్ర, బలభద్ర, జగన్నాథ మూర్తులను మూడు వేర్వేరు రథాల్లో ఊరేగించేవారు. అయితే కొందరు దుండగులు రథాలు కాల్చివేయడంతో మహారాజా తదనంతరం ఆ సంప్రదాయాన్ని విరమించుకున్నారు. 2019 నుంచి తిరిగి మూడు రథాలు తయారుచేసి, యాత్రను కొనసాగిస్తున్నారు.

సబ్‌జైలులో ఖైదీ బలవన్మరణం

- ముందు పరస్పరం కత్తులతో దాడి చేసుకున్న ఖైదీలు



మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రిలో మిలాన్ మిర్ధ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని సబ్ జైలులో ఓ ఖైదీ శనివారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలు వివరాలు ఇలా ఉన్నాయి. వేర్వేరు కేసుల్లో 5నెలలుగా ఇదే జైలులో శిక్ష అనుభవిస్తున్న ప్రశాంత్ కుండా, మున్నా బాలారి మధ్య శుక్రవారం వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఇద్దరూ ఒకరిపై ఒకరు కత్తులతో దాడి చేయగా, ప్రశాంత్‌కు గాయాలయ్యాయి. దీంతో అతనిని ఆస్పత్రికి తరలించగా, కొద్ది సేపటికే జైలులో ఉన్న మిలాన్ ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో సబ్ జైలులో ఖైదీల భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఓ హత్య కేసులో అరెస్టయిన మిలాన్.. గత మూడేళ్లుగా శిక్ష అనుభవిస్తున్నాడు. శుక్రవారం రాత్రి తోటి ఖైదీలందరితో బాగానే ఉన్న అతను శనివారం వేకువజామున తోటి ఖైదీకి ఉరి వేసుకొని కనిపించాడు. వెంటనే జైలర్ ఎస్‌కే శర్మకు సమాచారం అందించగా, మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే సరికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న బరంపురం డీఐజీ గోరిప్ సాహు హుటాహుటిన జైలుకు చేరుకొని, సీసీ టీవీ ఫుటేజీన్ పరిశీలించారు. ఆత్మహత్యగా నిర్ధారించడంతో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగిస్తామని ప్రకటించారు. అయితే తమ కుమారుడిది ఆత్మహత్య కాదని, హత్యని మృతుడి తండ్రి ఆమ్లాన్ మిర్ధ ఆరోపించారు. మిలాన్ రెండో భార్య కూడా హత్య కేసులో ఇదే జైలులో శిక్ష అనుభవిస్తోందని, ఆమె ప్రమేయం ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

వర్షాలకు ముందే మండీలో తెరవాలి



సబ్ కలెక్టరేట్ వద్ద రైతులు

జయపురం: వర్షాలు ప్రారంభం కావడానికి ముందే రబీ ధాన్యం కొనుగోలు మండీలు తెరవాలని బొరిగుమ్మ సమితి నారిగాం, సెమలాగుడ, రణస్‌పూర్, బెనస్‌పూర్, ముంజ, బెనాగాం పంచాయతీల ప్రజలు కోరారు. ఈ మేరకు జయపురం సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్‌ను శనివారం కలిసి, వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నైరుతి పవనాల ప్రవేశంతో వర్షాలు జోరందుకోనున్నాయని తెలిపారు. ఈనెల 4నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ముందుగా టోకెన్లు పంపిణీ చేశారని రైతులు లక్ష్మణ నాయక్, బీరేంద్రకుమార్, బాలాజీ హొత్తా, ఎం.రామదొర, ఆదినారాయణ, జనార్దనరావు, గణేశ్వర హొత్తా, సరోజ్‌కుమార్ దొర, అమర దొర, ఎస్.గోవిందదొర తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఒక్కరి నుంచి కూడా కొనుగోలు చెయ్యలేదని వాపోయారు. అంతా ధాన్యం నూర్పిడి పూర్తి చేసి, కళ్లాల్లోనే నిల్వ చేశామని, చినుకు పడితే మొత్తం తడిసి ముద్దవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని వెంటనే సేకరణ ప్రారంభించాలని విన్నవించారు.

కొరాపుట్ కాంగ్రెస్‌లో.. అంతర్గత కుమ్ములాటలు!





డీసీసీ అధ్యక్షుడు దుర్గాశంకర సాహు

- డీసీసీ నూతన అధ్యక్షుడిగా దుర్గాశంకర సాహు నియామకం
- తన అనుచరుడికి పదవి దక్కడంతో ఎంపీ సప్తగిరి సంతృప్తి
- ఇటీవలే పీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే తారాప్రసాద్ వర్గం
- మీనాక్షి బహిణీపతిని కొనసాగించకుంటే రాజానీమా చేస్తామంటూ హెచ్చరిక



జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



డీసీసీ మాజీ అధ్యక్షురాలు మీనాక్షి బాహిణీపతి



కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క

జయపురం: కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పీసీసీ సభ్యుడు దుర్గాశంకర సాహు(బుల్లు సాహు) నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఎంపీ సప్తగిరి ఉల్క ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 10జిల్లాలకు డీసీసీ నూతన అధ్యక్షులను ప్రతిపాదించారు. దీనికి పీసీసీ అధ్యక్షుడి ఆమోదం లభించడంతో నియామకాలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్న దుర్గాశంకర సాహు.. గతంలో అవిభక్త కొరాపుట్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. కొరాపుట్ సహకార ఉద్యమంలో ముఖ్యపాత్ర వహించారు. కొన్నేళ్లు అవిభక్త కొరాపుట్ జిల్లా సహకార సంస్థల అసోసియేషన్ అధ్యక్షుడిగా, డీసీసీ ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. అయితే బుల్లు తాజా నియామయంపై జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ వర్గీయులు పెదవి విరిచారు. దీంతో జిల్లా కాంగ్రెస్‌లో విభేధాలు మరింత ముదిరే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటి వరకు డీసీసీ అధ్యక్షురాలిగా ఉన్న మీనాక్షీ బాహిణీపతి.. కొద్ది రోజుల క్రితం పీసీసీ కమిటీలో కార్యదర్శిగా నియమించారు. అయితే ఆమె ఆ పదవిని తిరస్కరించారు. అలాగే పీసీసీ అధ్యక్ష పదవిపై ఆశలు పెట్టుకున్న తారాప్రసాద్ బాహిణీపతిపై నీళ్లు చల్లారు. ఈ చర్యలు భార్య, భర్తలను నిరాశ పరిచినట్లుగా స్థానికులు చర్చించుకుంటున్నారు.

అదే జరిగితే..?

2019 సాధారణ ఎన్నికల్లో అవిభక్త కొరాపుట్ జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ కేవలం జయపురం లోనే విజయం సాధించింది. అలాగే రాష్ట్రంలో ఆ పార్టీ తరపున ఎన్నికైన ఒకే ఒక్క ఎంపీగా సప్తగిరి ఉల్క ఉన్నారు. జిల్లాలో కాంగ్రెస్ శ్రేణులకు తారాప్రసాద్ బాహిణీపతి శక్తియుక్తులు బాగా తెలుసు. ఈ నేపథ్యంలో డీసీసీ అధ్యక్షుడిగా దుర్గాశంక సాహును నియమించడంతో పార్టీ పరిస్థితి ఎలా ఉంటుందనేది చర్చనీయాంశమైంది. నూతన అధ్యక్షుడిగా సాహు జిల్లాలోని 14 సమితిలు, 4 మున్సిపాలిటీల్లోని పార్టీ శ్రేణులను ఒక తాటిపైకి తీసుకు రాగలరా? క్షేత్రస్థాయిలో బలోపేతం చేయగలరా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. సప్తగిరి ఉల్క మద్దతుదారుడైన బల్లూ ఇప్పటి వరకు తారాప్రసాద్ నిర్వహించే అన్ని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చారు. అయితే ఇప్పుడు ఎమ్మెల్యే వర్గం కూడా సాహుకు సహకరిస్తారా అనే చర్చ సాగుతోంది. అలాగే బాహిణీపతి మద్దతుదారులు చెప్పినట్లు సామూహిక రాజీనామాలు చేస్తారా? అదే జరిగితే జిల్లాలో కాంగ్రెస్ పరిస్థితి ఏంటనేది శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది.

పంతం నెగ్గించుకున్న ఎంపీ..

మరోవైపు కొరాపుట్ జిల్లాలోని కాంగ్రెస్‌కు మద్దతుదారులైన వివిధ పంచాయతీల ప్రతినిధులు, మున్సిపల్ ఛైర్మన్లు, విభాగాల నేతలు.. ఎమ్మెల్యే తారాప్రసాద్‌తో సహా ఇటీవల భువనేశ్వర్ వెళ్లారు. పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్‌ను కలిసి, మీనాక్షి బాహిణీపతిని డీసీసీ అధ్యక్షురాలిగా కొనసాగించాలని, లేనిపక్షంలో సామూహిక రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు. ఇది జరిగిన కొద్ది రోజులకే కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క తన వర్గీయులతో పీసీసీ అధ్యక్షుడిని కలుసుకొని, జయపురం ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల మధ్య జరుగుతున్న వివాదం కొనసాగుతున్న తరుణంలో ఎంపీకి సన్నిహితుడైన దుర్గాశంకర సాహును డీసీసీ అధ్యక్షుడిగా నియమించడం తారాప్రసాద్ జోరుకు కళ్లెం వేయడమేనని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

ఒకే దేశం.. ఒకే రేషన్

- పథకాన్ని ప్రారంభించిన సీఎం నవీన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం నవీన్ పట్నాయక్


బరంపురం: బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఒకే దేశం-ఒకే రేషన్ పథకాన్ని ప్రారంభించారు. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ నుంచి సీఎం నవీన్ పట్నాయక్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బీఎంసీ నగర మేయర్ సంఘమిత్ర దొళాయి, బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ పండా, కమిషనర్ సోనియా జెన్నా, డిప్యూటీ కలెక్టర్ వినోద్‌కుమార్ బెహరా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



హాజరైన మేయర్ సంఘమిత్ర, ఎమ్మెల్యే విక్రమ్, కమిషనర్ జెన్నా

ప్రదీప్ మాఝికి మరిన్ని అధికారాలు

- ఎస్‌డీసీలో 13ప్రభుత్వ శాఖలను అటాచ్ చేసిన రాష్ట్రప్రభుత్వం
- రాష్ట్రవ్యాప్తంగా ప్రదీప్ పర్యటనకు వ్యూహం



ఎస్‌డీసీ సలహాదారుడు ప్రదీప్ మాఝి

కొరాపుట్: రాష్ట్ర స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సలహాదారుడు ప్రదీప్ మాఝికి రాష్ట్రప్రభుత్వం మరిన్ని అధికారాలు కట్టిపెట్టింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేస్తూ 13ప్రభుత్వ శాఖల కార్యదర్శులను కౌన్సిల్‌లో సభ్యులుగా చేర్చింది. ఇందులో ఇప్పటికే రాష్ట్ర కెబినెట్ మంత్రి హోదాలో సలహాదారుడిగా ప్రదీప్ కొనసాగుతున్నారు. ప్రస్తుతం ముఖ్యమైన ఆర్థిక, రెవెన్యూ, వైద్య, అటవీ, గిరిజన, ప్రాథమిక విద్య, ఉన్నత విద్య, సాంస్కృతిక, వర్క్స్, మత్స్య తదితర ముఖ్యమైన శాఖల కార్యదర్శులను కౌన్సిల్ పరిధిలోకి తీసుచేవచ్చి, సాహసోపేత నిర్ణయం తీసుకుంది. ఇది రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. కొన్నళ్ల క్రితం ఎస్‌డీసీ కౌన్సిల్ అంటే ఏంటో ఎవరికీ తెలియదు. ప్రదీప్ కాంగ్రెస్ పార్టీలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉంటూ రాష్ట్రంలో బలమైన గిరిజన యవ నాయకుడిగా కొనసాగుతుండేవారు. అప్పటికే ఎంపీగా పదవీ కాలం ముగిసింది. ఈ నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడిగా నియమించనున్నట్లు ఊహాగానాలు కూడా వినిపించాయి. అయితే అదే సమయంలో ఆయన బీజేడీలో చేరగా.. రాజ్యసభకు నామినేట్ చేయవచ్చని ఆశించారు.

రూ.400కోట్లు కేటాయింపు..

ఊహించని విధంగా సీట్ల పంపకంలో ప్రదీప్‌కు చుక్కెదురైంది. దీంతో అసంతృప్తితో ఉన్న ఆయనకు ఊరటనిస్తూ ఎస్‌డీసీ సలహాదారుడిగా ప్రభుత్వం నియమించింది. కానీ ఏ మాత్రం విలువలేని ఆ పదవి పట్ల రాజకీయ వర్గాలను నిష్టూరాలు మొదలయ్యాయి. ఈ మేరకు వెంటనే నష్ట నివారణ చర్యలు చేపట్టిన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్.. కౌన్సిల్‌లో ప్రదీప్‌కు మంత్రి హోదా కట్టబెట్టారు. అనంతరం కౌన్సిల్‌లో 9 గిరిజన జిల్లాలు చేరుస్తూ ఆయా జిల్లాలకు అధ్యక్షులను నియమించింది. కార్యచరణలో తొలుత రూ.240 కోట్లు కేటాయించడంతో పాటు వెంటనే మరో 14 జిల్లాలను కౌన్సిల్ కలిపి మొత్తం 23 జిల్లాలకు విస్తరిస్తూ ఆదేశించింది. నిధులు కూడా రూ.400 కోట్లు కేటాయించింది. తాజాగా 13 ముఖ్య శాఖల కార్యదర్శులను కౌన్సిల్‌లో సభ్యులుగా చేరుస్తూ మరింత బలోపేతం చేసింది. ఈ చర్యలతో ప్రదీప్ మాఝిని కేబినెట్ హోదా కలిగిన మంత్రిగా తయారు చేసింది. మరోవైపు అధికారాలను సద్వినియోగం చేసూకుంటూ రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులను బీజేడీ వైపు పూర్తి స్థాయిలో ఓటు బ్యాంక్‌గా మార్చాలని చెప్పకనే చెప్పింది. ఈ సందర్భంగా ప్రదీప్ శనివారం 'సాక్షి'తో మాట్లాడారు. తన స్వస్థలం నవరంగ్‌పూర్ జిల్లా అయినా.. రాష్ట్ర ష్తంగా పర్యటిస్తూ కౌన్సిల్ ద్వారా 172 సమితులలో గిరిజనులకు సహాయం చేస్తానని ప్రకటించారు.

అకాడమీ టీ20 టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న మంత్రి శ్రీకాంత్ సాహు

బరంపురం: జిల్లాలోని పులసరా బ్లాక్ మెడికల్ కళాశాల మైదానంలో లీడ్స్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో టీ20 క్రికెట్ టోర్నీ నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి శ్రీకాంత్ సాహు ముఖ్య అతిథిగా హాజరై, పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ పోటీల్లో గంజాం, పుల్బణి, కటక్, భువనేశ్వర్, గజపతి జిల్లాలకు చెందిన వివిధ జట్లు పాల్గొన్నాయి.

ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్న మంత్రి.. మెరుగ్గా రాణించాలని ప్రోత్సహించారు. అనంతరం కొద్దిసేపు బ్యాటింగ్ చేసి, అందరినీ ఉత్సాహ పరిచారు.

ముగిసిన వీహెచ్‌పీ శిక్షణ శిబిరం



వార్శికోత్సవంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

పర్లాకిమిడి: విశ్వహిందూ పరిషత్ వార్శికోత్సవం సందర్భంగా కార్యకర్తలకు గత 10రోజులుగా జరుగుతున్న శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమాన్ని పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్‌లో శనివారం నిర్వహించారు.

కార్యక్రమానికి వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు కైలాష్ గౌడో, దేవీమఠం మహంత రామానంద దాస్, హరిమోహన్ పట్నాయక్, జిల్లా ప్రహరి శ్యామసుందర శొబోరో, అనాది పాణిగ్రాహి, ఆశాలతా అమ్మన్న, నరేష్ లెంకా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యులకు సూర్య నమస్కారాలు నేర్పించారు. అనంతరం జరిగిన సాధారణ సభలో యువరాణి కల్యాణీదేవి గజపతి పాల్గొని మాట్లాడారు.

కుంద్రా పోలీసు స్టేషన్ ముట్టడి



ఆందోళనకారులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు



పోలీసు స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్తులు

జయపురం: హత్య కేసులో నిందితులందరినీ అరెస్ట్ చేయాలని కుంద్రా సమితి ఖెందుగుడ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కుంద్రా పోలీస్ స్టేషన్‌ను శనివారం ముట్టడించారు. అంతేకాకుండా స్టేషన్ అధికారి అవమానకరంగా ప్రవర్తించడంతో పాటు నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం మే 1న కుంద్రా సమితి కెరామటి పంచాయతీ ఖెందుగుడ గ్రామానికి చెందిన ధనపతి దురువాను అమానుషంగా హత్య చేశారని, ఈ కేసులో కుంద్రా పోలీసు అధికారి ఓ నిందితుడిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచారని తెలిపారు. అయితే హత్యలో సంబంధం ఉన్న మిగతా వారిని పట్టుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. దీనిపై పోలీసులను కలిసేందుకు వెళ్లగా, గ్రామస్తులపై దురుసుగా ప్రవర్తించారన్నారు. ఆదివాసీల పట్ల వివక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఆయన చర్యలకు నిరసనగా పోలీస్ స్టేషన్‌ను ముట్టడించామన్నారు. ఇప్పటికైనా ధనపతి దురువ హత్య కేసులో అసలు దోషులను పట్టుకొని, కఠినంగా శిక్షించాలని కోరారు. అయితే ఆరోపణలపై కొందరు మీడియా ప్రతినిధులు కుంద్రా పోలీసు అధికారి వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన స్పందించలేదు.

సారా బట్టీలపై ఎక్సైజ్ దాడులు

- 4వేల లీటర్ల సారా ధ్వంసం



చికిటిపెంటలో స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రి

బరంపురం: జిల్లా పోలీసు పరిధిలోని అక్రమంగా నిర్వహిస్తున్న సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు చేపట్టారు. ఇందులో 3500 లీటర్ల సారా ధ్వంసం చేశారు. ఎక్సైజ్ కమిషనర్ రామచంద్ర మిశ్రా అందించిన సమాచారం ప్రకారం గొళంతరా పోలీస్ స్టేషన్ పరిధిలోని తుంబా గ్రామ శివారు అటవీ ప్రాంతంలో అక్రమంగా సారా తయారు చేస్తున్న బట్టీలపై దాడులు చేపట్టారు. అలాగే కె.నువాగం పోలీసు స్టేషన్ పరిధి చికిటిపెంట శివారులో సారాను ధ్వంసం చేయడంతో పాటు తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. రెండు ప్రాంతాల్లో మొత్తం 3,500 లీటర్ల సారా ధ్వంసం చేశామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.



తుంబా అటవీ ప్రాంతంలో పట్టుబడిన సారా

కొఠియా పోలీసుల దాడి



కొరాపుట్: సారా ధ్వంసం చేస్తున్న ఆంధ్రా పోలీసులు

కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా వివాదాస్పద ప్రాంతం కొఠియాలో సారా తయారీ కేంద్రాలపై ఆంధ్రప్రదేశ్‌కు చెందని పోలీసులు దాడులు చేపట్టారు. కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియా పంచాయతీలో కొండలపై ఉన్న కొయ్యిగూడవలస అటవీ ప్రాంతంలో సారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం కొఠియా పోలీస్ స్టేషన్ సీఐ బి.రోహిణీపతి నేతృత్వంలో దాడి నిర్వహించారు. ఇందులో 7 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 500 లీటర్ల సారాను నేలపాలు చేశారు. దీని విలువ రూ.3.5 లక్షలు ఉంటుందని సీఐ ప్రకటించారు.

క్లుప్తంగా

పారదర్శకంగా బదిలీలు

విజయనగరం ఫూల్‌బాగ్: అటవీశాఖ ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా జరిగినట్టు డీఎఫ్‌ఓ శంబంగి వెంకటేష్ తెలిపారు. అటవీశాఖ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం జారీచేసిన బదిలీ ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారిని బదిలీ చేశామన్నారు. ఐదేళ్లలోపు ఉద్యోగులను వారి అభ్యర్థన మేరకు మాత్రమే బదిలీ చేసినట్టు తెలిపారు. బదిలీల వ్యవహారంలో నిబంధనలు పాటించలేదన్నది ఆరోపణలు మాత్రమేనని డీఎఫ్‌ఓ స్పష్టం చేశారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్-9 బాల, బాలికల చెస్‌చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు శనివారం పూర్తయ్యాయి. నగరంలోని రింగ్ రోడ్డులో గల ఫైర్ చెస్ స్కూల్‌లో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 30 మంది బాలబాలికలు హాజరయ్యారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కె.వి.జ్వాలాముఖి తెలిపారు. ఎంపికైన వారిలో అక్కివరపు ప్రవేష్, రిషీంద్ర, లిఖిత, ప్రశాంతిలు ఉన్నారు. వీరు వచ్చేనెలలో కృష్ణా జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపిక పోటీలను జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు పర్యవేక్షించారు.

విద్యార్థి ప్రతిభ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్‌ఈసీ గ్రూపు చదివిన తాడంగి గణేష్ అత్యంత ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 18వ ర్యాంకును సాధించాడు. గణేష్‌ను ప్రిన్సిపాల్ ఆకులరాజు, కళాశాల సిబ్బంది అభినందించారు.

పశువుల శాలల దగ్ధం



మంటలను అదుపులోకి తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గజపతినగరం రూరల్: మండలంలోని కెంగువ గ్రామంలో శనివారం మధ్యాహ్నం నాలుగు పశువుల శాలలు, రెండు గడ్డివాములు దగ్ధమైనట్టు గజపతినగరం అగ్నిమాపక అధికారి రవి తెలిపారు. కాల్చిన సిగరెట్లు పడేయడంతో గ్రామానికి చెందిన గుడివాడ అప్పలనాయుడు, గుడివాడ రమణ, సుంకరి సూరినాయుడు, రెడ్డి అప్పలనాయుడులకు చెందిన నాలుగు పశువుల శాలలు, రెండు గడ్డివాములు దగ్ధమైనట్టు తెలిపారు. సుమారు రూ.80వేల నుండి రూ.లక్ష వరకూ ఆస్తి నష్టం ఉండవచ్చని తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటలు ధ్వంసం చేస్తున్న పోలీసులు

సాలూరు: మండలంలోని కోయిగుడ్డివలస వద్ద 3500 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేసినట్టు కొటియా సీఐ రోహిణిపతి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కురుకుట్టి పంచాయతీ కోయిగుడ్డివలస వద్ద ఏడు డ్రమ్ముల్లో ఉన్న 3500 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేశామన్నారు. వీటి విలువ సుమారు 3లక్షల 50వేల రుపాయిలు ఉంటుందని తెలిపారు.

అంబేడ్కర్ విదేశి విద్యను కొనసాగించాలి

రాజాం సిటీ: అంబేడ్కర్ విదేశి విద్య పథకాన్ని సవరించి ప్రవేశపెట్టిన కొత్త సార్వత్రిక విదేశి విద్యా పథకంలో ఎస్సీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు అన్నారు. నూతన విధానం రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు. రాజాంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమతా సైనిక్‌దళ్ ఉత్తరాంధ్ర స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా న్యాయం చేయాలని అన్నారు. ప్రభుత్వం వెనక్కి తీసుకున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, భూములు కొనుగోలు పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దళితుల భూములను అక్రమంగా కబ్జా చేస్తున్నారని వస్తున్న ఫిర్యాదులపై త్వరితగతిన విచారణకు స్పెషల్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి యర్రం సుధీర్‌బా బు, నాయకులు దేబారిక రామప్పడు, కె.బాబాజీ, రెయ్యి రామకృష్ణ, గండి పైడిరాజు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రత.. @40 డిగ్రీలు



- కొన్నిచోట్ల 42 డిగ్రీల నమోదు
- ఉదయం 9 గంటలకే బయటకు రాలేని పరిస్థితి
- వడగాడ్పులతో జనం ఉక్కిరిబిక్కిరి
- పెరిగిన ఏసీలు, కూలర్ల వినియోగం
- ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు
- వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచన



ఎండవేడమికి గొడుగు నీడలో వెళ్తున్న మహిళ



విజయనగరం ఫోర్ట్:

భానుడు భగభగ మండుతున్నాడు.. నిప్పుల వాన కురిపిస్తున్నాడు. గత నాలుగు రోజులుగా అగ్నిగోళం బద్దలయిందా అన్నట్టుగా ఎండలు తలపిస్తున్నాయి. నెత్తిమీద అగ్గి పోసినట్టుగా సెగపుట్టిస్తున్నాయి. ఉదయం 9 గంటలైతే చాలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడాల్సిన పరిస్థితి. ఎండతో పాడు వడగాడ్పులకు జనం విలవిల్లాడుతున్నారు. ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. బైక్‌పై ప్రయాణించే వారు, ఉపాధిహామీ వేతనదారులు, రైతులు, రైతు కూలీలు ఎండ వేడిమికి తట్టుకోలేక అవస్థలు పడుతున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీలు నమోదు కాగా మరి కొన్ని ప్రాంతాల్లో 42 డిగ్రీలు నమోదయింది. టోపీ, హెల్మెట్, కళ్లద్దాలు, మర్ఫీలు వంటి రక్షణ కవచాలు ఏవీ ఎండ ముందు పని చేయడం లేదు.

ఉదయం 5:30 గంటలకే పనులకు...

ఎండ తీవ్రతకు తట్టుకోలేక ఉపాధిహామీ వేతనదారులు ఉదయం 5:30 గంటలకే పనికి వెళ్లి 9:30 గంటలయ్యేసరికి ఇంటికి చేరుకుంటున్నారు. పనిప్రదేశాల్లో వేసిన టెంటులు భానుడి భగభగల నుంచి రక్షణ ఇవ్వలేక బోసిపోతున్నాయి. ఇటుక బట్టీల వద్ద పనిచేసేవారు ఉదయం 9 గంటలకే పని ముగించేస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకునేవారు.. తోపుడు బండ్లపై ఊరూరా వ్యాపారం చేసుకునే వారు ఎండలో తిరగలేక ఏదో ఒకచోటకే పరిమితం అవుతున్నారు. ఎండ తీవ్రతకు పిల్లలు, రోగులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఇబ్బందులు పడుతున్నారు. చర్మ, బర్నింగ్ రోగులు, శస్త్రచికిత్సలు చేసుకున్నవారి పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

ఈ నెల 6వ ఏదీ నుంచి 10వ తేదీ వరకు నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు:

తేదీ	గరిష్టం	కనిష్టం
6	38	28
7	38	28
8	39	28
9	40	31
10	40	29

ద్రవ పదార్థాలు తీసుకోవాలి..

ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున డీ హైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉందని, ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కొబ్బరి నీళ్లు, మంచి నీరు, ఓఆర్‌ఎస్ ద్రావణం, మజ్జిగ, పళ్ల రసాలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా ఎండ తాకిడి నుంచి ఉపశమనం పొందవచ్చని చెబుతున్నారు.

ఎండలో తిరగరాదు




ఎండతీవ్రత అధికంగా ఉన్నందున సాధ్యమైనంత వరకు ఎండలో తిరగరాదు. అత్యవసరం అనుకుంటే టోపీ, గొడుగు వంటివి వినియోగించాలి. ఎండలోకి వెళ్లేటప్పుడు మజ్జిగ, నీరు ఎక్కువగా తీసుకోవాలి. వడదెబ్బకు గురైతే వెంటనే సమీపంలో ఉన్న పీహెచ్‌సీ, సీహెచ్‌సీకి వెళ్లాలి. ఉపాధిహామీ వేతనదారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నాం.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

పెరిగిన ఏసీలు, కూలర్ల వినియోగం



ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు జనం ఏసీలు, కూలర్లను తెగవాడేస్తున్నారు. ఫ్యాన్లు ఉన్నా ఎండ నుంచి ఉపశమనం పొందలేక పోతున్నారు. ఎండ తీవ్రతకు అధికశాతం మంది ఏసీలు కొనుగోలు చేసేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఏసీల వినియోగం పెరుగుతోంది.



దేశ సేవకు సదవకాశం



పరుగు శిక్షణలో యువత

- వచ్చేనెలలో విజయనగరం వేదికగా ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ
- సెట్విజ్ ఆధ్వర్యంలో 40 రోజులపాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ
- శిబిరం నిర్వహణకు రూ.5 లక్షల నిధులు కేటాయించిన జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- ప్రారంభమైన అర్హతగల అభ్యర్థుల ఎంపికలు

విజయనగరం: దేశ భద్రతలో కీలక పాత్ర పోషించే అగ్నివీర్ (ఆర్మీ)లో చేరదలచుకునే జిల్లా యువతకు సువర్ణావకాశం. వచ్చేనెల 20 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు విజయగనరంలోని పోలీస్ ట్రైనింగ్ కళాశాల వేదికగా జరగనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇచ్చేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. సెట్విజ్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడామైదానంలో 40 రోజుల పాటు శిక్షణ సాగనుంది. శిక్షణ పొందేందుకు ఉత్సుకత కలిగిన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ప్రాథమిక పరీక్షలో భాగంగా అభ్యర్థులకు 800 మీటర్ల పరుగు పోటీ, పుల్‌అప్స్, 8 ఫీట్‌డిచ్, జిగ్‌జాగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో అర్హత సాధించిన వారికి ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నారు. ఎంపిక ప్రక్రియలో అర్హత సాధించిన 100 మంది అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో రాత పరీక్ష కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వనుండగా.. రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో మాజీ సైనిక ఉద్యోగులు, పోలీస్ శిక్షణ కళాశాల అధ్యాపకులు, ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించే వ్యాయామ ఉపాధ్యాయులు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కోచ్‌లు శారీరక ధృఢత్వ పరీక్షపై శిక్షణ ఇవ్వనున్నారు.

ప్రజాప్రతినిధులు సహకారం

అగ్నిపథ్ ర్యాలీలో పాల్గొనే యువతకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ తరగతుల నిర్వహణకు జిల్లా ప్రజాప్రతినిధులు తమవంతు సహకారం అందిస్తున్నారు. శిక్షణ తరగతుల నిర్వహణకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు రూ.5లక్షల నిధులు అందజేశారు. 40 రోజుల పాటు అభ్యర్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సమకూర్చనున్నారు.

మంచి అవకాశం



దేశ రక్షణ రంగంలో కీలకమైన ఆర్మీలో చేరదలచిన విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన వంద మంది నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నాం. 40 రోజుల పాటు విజయనగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో నిష్ణాతులైన అధ్యాపకులు శిక్షణ ఇస్తారు. అగ్నిపథ్ (ఆర్మీ)కు ఎంపికయ్యేలా శిక్షణ సాగుతుంది. సువర్ణావకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి. పూర్తి వివరాలకు సెల్: 98499 13080 నంబర్‌ను సంప్రదించాలి.

– బి.రామ్‌గోపాల్, సీఈఓ, సెట్విజ్, విజయనగరం

27 నుంచి రాష్ట్రస్థాయి యువజన శిక్షణ తరగతులు

విజయనగరం ఫూల్‌బాగ్: గుంటూరులో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి యువజన శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.వాసు కోరారు. స్థానిక అమర్ భవన్‌లో శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను శనివారం విడుదల చేశారు. కార్యక్రమంలో బి.త్రినాథరావు, ఎం.కె.ఈశ్వరరావు, వంశీ పాల్గొన్నారు.

నేడు ఉమెన్స్ టీ-20 తుది పోరు

- ఫైనల్స్‌కు చేరిన విజయనగరం రోయల్స్ వైజాగ్ డాల్ఫిన్స్ జట్లు
- విజేతలకు బహుమతులు ప్రధానం చేయనున్న మంత్రి బొత్స



విజయనగరం రోయల్స్ జట్టు



వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు

విజయనగరం: జిల్లా వేదికగా జరుగుతున్న ఉమెన్స్ టీ - 20 క్రికెట్ లీగ్ పోటీలు తుది దశకు చేరుకున్నాయి. ఈ నెల 4 నుంచి డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో జరుగుతున్న పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన విజయనగరం రోయల్స్ - వైజాగ్ డాల్ఫిన్స్ జట్లు ఫైనల్స్‌లో తలపడనున్నాయి. ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు చివరి మ్యాచ్ ప్రారంభం కానుండగా... విజేతగా నిలిచిన జట్టుకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేతుల మీదుగా బహుమతీ ప్రధానోత్సవం చేయనున్నారు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం బెజవాడ బ్లేజర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో విజయనగరం రోయల్స్ జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడిన బెజవాడ బ్లేజర్స్ జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించగా... నిర్ణీత 20 ఓవర్లలో 113 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన విజయనగరం రోయల్స్ జట్టు 17.5 ఓవర్లలో వికెట్ నష్టపోయి 115 పరుగులు జోడించి విజయం సాధించింది. మధ్యాహ్నం రాయలసీమ క్వీన్స్ జట్టుతో జరిగిన మరో మ్యాచ్‌లో వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు 5వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచిన రాయలసీమ క్వీన్స్ జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించగా... 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టపోయి 109 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు 19.4 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 112 పరుగులు జోడించి విజేతగా నిలిచింది. రెండు మ్యాచ్‌లలో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ క్రీడాకారులకు ఏసీఏ ప్రతినిధులు అభినందించారు.

శిశువు హార్ట్ సర్జరీకి తిరుపతికి రిఫర్

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని కోడిశ పంచాయతీ పరిధిలో బిల్లగూడ గ్రామానికి చెందిన ఎస్.భవాని నాలుగు రోజుల కిందట స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రసవించింది. పుట్టిన మగ శిశువుకు హార్ట్‌కు సంబంధించి సమస్య రావడం (కన్జెన్షియల్ హార్ట్ డిసీజ్)తో సర్జరీకి తిరుపతిలోని పద్మావతి మెడికల్ కళాశాలకు రిఫర్ చేశారు. శనివారం కిమ్స్ ఆస్పత్రికి తీసుకువెళ్లి పరీక్షలు జరిపారు. వెంటనే ఆపరేషన్ చేయాలని అక్కడి వైద్యులు సూచించారు. దీంతో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన పీఓ ప్రత్యేక అంబులెన్స్ ఏర్పాటు చేసి శనివారం రాత్రి సీతంపేట నుంచి తిరుపతికి తరలించారు. అంబులెన్స్‌లో ఇద్దరు పైలెట్లు ప్రకాశరావు, కుమార్‌లతో పాటు కుటుంబ సభ్యులు వెళ్లారు.

సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి, తదితరులు

విజయనగరం టౌన్: మన హైందవ సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణ ధ్యేయంగా వాగ్దేవీ సమారాధనం సంస్థ కృషి చేస్తోందని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి పేర్కొన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో శనివారం ఈ ఏడాది చేపట్టబోయే సంస్థ కార్యకలాపాల విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై 3వ తేదీన ఆషాఢ శుద్ధ పౌర్ణమి వేదవ్యాసుని జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వేదం అభివృద్ధికి, పరిరక్షణకు కృషి చేస్తోన్న ప్రముఖ గురువుల ఉపన్యాసం, పలువురు వేద పండితులకు ఘన సత్కారం ఉంటుందన్నారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు పైడితల్లి అమ్మవారి కల్యాణ మండపంలో కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు పివిఎస్.సుబ్బారావు, అమ్మాజీ, భోగరాజు సూర్యలక్ష్మి, భేరి రాధికారాణి, సభ్యులు నరసింహాచార్యులు, తిరుపతిరావు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

'సెబ్'కు తీపి కబురు

- సెబ్ కార్యాలయాల నిర్వహణకు సొంత భవనాలు
- 20 సెంట్లు స్థలంలో అన్ని సదుపాయాలతో స్టేషన్ నిర్మాణం
- జిల్లాలో 10 సెబ్‌లకు తీరనున్న కార్యాలయాల సమస్య
- తొలగనున్న అద్దె కష్టాలు
- స్థలాలు కేటాయిస్తున్న రెవెన్యూ యంత్రాంగం

చీపురుపల్లి: మద్యం, గుట్కా, మత్తుపదార్థాల అక్రమ అమ్మకాలు, రవాణాను అరికట్టడంలో కీలక భూమిక పోషిస్తున్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)కు ప్రభుత్వం తీపికబురు అందించింది. జిల్లాలో ఉన్న సెబ్ కార్యాలయాలన్నింటికీ అన్ని వసతులతో కూడిన సొంత భవనాలు నిర్మాణానికి నడుం బిగించింది. స్థలాల కేటాయింపునకు ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ నిర్ణయంతో అరకొర వసతులతో కూడిన అద్దె భవనాల్లో దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తున్న తమకు విముక్తి కలుగుతుందంటూ సెబ్ అధికారులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో పది స్టేషన్లకు సొంత భవనాలు

జిల్లాలో పది స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) స్టేషన్లు ఉన్నాయి. అందులో భాగంగానే జిల్లా కేంద్రంలోని విజయనగరం-1, విజయనగరం-2, చీపురుపల్లి, భోగాపురం, నెలిమర్ల, బొబ్బిలి, ఎస్.కోట, కొత్తవలస, గజపతినగరం, రాజాం పట్టణాల్లో సెబ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. పట్టణం, ప్రాంతాన్ని బట్టి ఒక్కో స్టేషన్‌కు రూ.10 నుంచి రూ.20 వేలు వరకు ప్రభుత్వమే అద్దెలు చెల్లిస్తోంది. అద్దె భవనాలు కావడంతో అరకొర వసతుల్లోనే విధులు నిర్వహించాల్సి వచ్చేది. అక్రమ మద్యం, మత్తు పదార్థాలు రవాణా సమయాల్లో దాడులు జరిపితే ఆ సమయంలో పట్టుబడిన వాహనాలు, సొత్తు వంటివి స్వాధీనం చేసుకుని కోర్టుకు సమర్పించేంత వరకు భద్రంగా ఉంచాల్సి వస్తుంది.

20 సెంట్ల స్థలంలో సొంత భవనాలు

ఇది ఇలా ఉండగా సెబ్ కార్యాలయానికి సొంత భవనం నిర్మాణం కోసం కనీసం 20 సెంట్లు స్థలం అవసరమని ఆ శాఖ గుర్తించింది. అందులో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయం, సబ్ ఇన్స్‌పెక్టర్ల కార్యాలయం, సిబ్బంది విధులు నిర్వహించేందుకు, పట్టుబడిన వాహనాలు భద్ర పరిచేందుకు స్టోర్ రూమ్ వంటి సదుపాయాలు కోసం 20 సెంట్లు స్థలం అవసరమని నిర్దేశించారు. సెబ్ అభ్యర్థన మేరకు జిల్లాలో పది చోట్ల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్లకు కలెక్టర్ నుంచి ఉత్తర్వులు అందాయి. అందులో భాగంగానే ఎక్కడికక్కడే తహసీల్దార్లు ప్రభుత్వ స్థలాలు గుర్తించి అనుమతులు ఇస్తున్నారు. త్వరలో సెబ్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మాణానికి నిధులు మంజూరుకానున్నాయి.

పేదలకు 'ఉపాధి'

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. కొలతల ప్రకారం పనులు చేస్తుండడంతో రోజువారీ వేతనం గిట్టుబాటు అవుతోంది. సొంతూళ్లలోనే మెరుగైన 'ఉపాధి' లభింస్తుండడంతో జిల్లాలో వలసలు తగ్గుముఖం పట్టాయి.

- గణనీయంగా తగ్గిన వలసలు
- ఒక్కో వేతనదారుడికి రెండు నెలలకు రూ.10వేల లబ్ధి
- 2,90,102 జాబ్ కార్డుదారులకు పని కల్పన
- 97,27,376 పనిదినాలు కల్పించారు
- వేతనదారులకు రూ.229.90 కోట్ల చెల్లింపు



గంట్యాడ మండలం నరవ గ్రామంలో పనిచేస్తున్న వేతనదారులు

విజయనగరం ఫోర్ట్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపాధి కల్పిస్తోంది. జిల్లాలో ఈ పథకం సమర్థవంతంగా అమలు చేయడం వల్ల వలసలు గణనీయంగా తగ్గాయి. మూడు, నాలుగు నెలల పాటు ఈ పథకం ద్వారా ఉన్న ఊళ్లలోనే పని దొరుకుతుంది. దీంతో అధిక సంఖ్యలో వేతనదారులు పనికి వెళ్తున్నారు. ప్రతి రోజు జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది వేతనదారులు పనికి వెళ్తున్నారు. ఈ పథకం రాక ముందు వందల సంఖ్యలో ప్రజలు వివిధ ప్రాంతాలకు పని కోసం వలస వెళ్లేవారు. చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు వలస వెళ్లేవారు. కొంతమంది 3, 4 నెలల పాటు పని చేసి స్వగ్రామాలకు తిరిగే వచ్చేవారు. మరి కొంతమంది అక్కడే స్థిర నివాసం ఉండేవారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వచ్చిన తర్వాత ఈ ప్రాంతాలకు వలసలు తగ్గిపోయాయి. ఉపాధి హామీ పథకం పనికి వెళ్లడం ద్వారా వచ్చిన వేతనాలు ద్వారా సొంత గ్రామంలోనే సాఫీగా జీవనం సాగిస్తున్నారు.

జిల్లాలో 3.51 లక్షల జాబ్‌కార్డులు

జిల్లాలో జాబ్ కార్డులు 3.51లక్షలు ఉన్నాయి. వీటి పరిధిలో 6 లక్షలు వేతనదారులు ఉన్నారు. ఏప్రిల్, మే నెలలో 2,90,102 మంది జాబ్ కార్డుదారులకు పని కల్పించారు. 97,27,376 పని దినాలు కల్పించారు. సగటున రోజుకు 2.50 లక్షల మంది వేతనదారులు పనికి వెళ్తున్నారు.

ఒక్కో వేతనదారుడికి రూ.10 వేల వరకు లబ్ధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనికి వెళ్లే వేతనదారుడికి వేలాది రుపాయిలు వేతనం రూపంలో వచ్చాయి. 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నెల నుంచి పనులు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్, మే నెలలో పని చేసిన దానికి వేతనదారులకు రూ.10 వేల వరకు లబ్ధి చేకూరింది. ఏప్రిల్, మే నెలల్లో వేతనదారులకు రూ.229.90 కోట్లు ప్రభుత్వం చెల్లించింది.

వేతనదారులకు గిట్టుబాటు వేతనం

ఉపాధి హామీ పథకంలో భాగంగా పనికి వచ్చే ప్రతి వేతనదారుడికి ప్రభుత్వం కనీస వేతనం వచ్చే విధంగా చర్యలు చేపట్టింది. గరిష్ఠ వేతనం రూ.272 కాగా వేతనదారులకు రూ.240 నుంచి రూ.272 వరకు వేతనం వచ్చే విధంగా చర్యలు తీసుకుంది. దీని వల్ల పని చేసిన దానికి వేతనం గిట్ట బాటు అయింది. వేతనాలు కూడా వారం రోజుల్లో జరుగుతుండడంతో వేతనదారులు ఉత్సాహంగా పనికి వస్తున్నారు. పని కల్పనలో విజయనగరం జిల్లా దేశంలోనే నెంబర్ వన్‌గా ఇటీవల నిలిచింది.

జాబ్‌కార్డు ఉన్న అందరికీ ఉపాధి



జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పని కల్పిస్తున్నాం. సొంత గ్రామంలో పని కల్పించడం వల్ల అధిక సంఖ్యలో వేతనదారులు పనికి వస్తున్నారు. వేతనం కూడా పని చేసిన దానికి గిట్టుబాటు అయ్యే విధంగా వచ్చింది. అన్ని వర్గాల వారు ఉపాధి హామీ పనికి వస్తున్నారు.

– జి.ఉమాపరమేశ్వరి, పీడీ, డ్వామా

క్లుప్తంగా

ఘనంగా శివకామేశ్వరుల కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం మొండేటివీధిలోని శివకామేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు సంప్రదాయ బద్ధంగా కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమంలో షిర్డీసాయి సేవా సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'నాట్యరత్న' పురస్కారాల ప్రదానం



అవార్డులు అందుకుంటున్న కౌండిన్య, బాలచందర్

శ్రీకాకుళం కల్చరల్: బెంగళూరులో నిర్వహించిన భరతోత్సవం-2023 జాతీయ నాట్యోత్సవంలో శ్రీకాకుళానికి చెందిన శివశ్రీ నృత్య కళా నికేతన్ అధ్యక్షుడు రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్యులు మంచి ప్రతిభ కనబర్చారు. శ్రీ భాష్యం సుందర రామ కౌండిన్య, పూజారి బాలచందర్‌లు కూచిపూడి నాట్యంలో రాణించడంతో వీరిని 'నాట్యరత్న' పురస్కారాలతో సత్కరించారు. శివప్రియ స్కూల్ ఆఫ్ డ్యాన్సు గురు డాక్టర్ సంజయ్ శాంతారాం అవార్డులను ప్రదానం చేసినట్లు శ్రీకాంత్ తెలిపారు.

సిక్కోలు రాజకీయ చరిత్ర పుస్తకావిష్కరణ



సిక్కోలు రాజకీయ చరిత్ర పుస్తక ఆవిష్కరణలో జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గుంట లీలా ప్రసాద్ రాసిన సిక్కోలు రాజకీయ చరిత్ర పుస్తకాన్ని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి ఆవిష్కరించారు. వర్సిటీకి వచ్చిన ఆమె శనివారం పుస్తకం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశోధనాత్మక పుస్తకాల వల్ల చరిత్ర నేటి తరానికి తెలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో వీసీ నిమ్మ వెంకటరావు, విజయనగరం జిల్లా సెషన్స్ జడ్జి బి.సాయికళ్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

మౌనమే మంత్రమై..



పెళ్లి పీటలెక్కిన ప్రేమ జంట

నరసన్నపేట: పెళ్లి మంత్రాలు ఇద్దరూ వినలేరు. కానీ మౌనాన్నే మంత్రంగా చేసుకున్నారు. ఒకరి పేరు ఒకరికి చెప్పుకోలేరు. కానీ ఒకరి మనసును ఒకరు గెలుచుకున్నారు. నరసన్నపేట నాయుడు వీధికి చెందిన కిరణ్, విశాఖపట్నం తాటిచెట్లపాలెంకు చెందిన అద్దంకి అలేఖ్యలు బధిరులు. ఇద్దరూ డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. ప్రేమలో పడిన ఈ జంట స్నేహితుల సాయంతో నరసన్నపేట వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఒక్కటైంది. స్నేహితులే పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. వరుడి తరఫున బంధువులు రాగా వధువు తరఫున స్నేహితులే బంధువులయ్యారు.

ఆలయ నిర్మాణానికి దాతల సహకారం

పాలకొండ రూరల్: మండల కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రం వద్ద గారమ్మ ఆలయ నిర్మాణానికి దాతలు తమవంతు సహకారం అందించారు. శనివారం ఆలయ నిర్మాణ ప్రాంతంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పల్లా కొండలరావు, దూబ వెంకటరమణ తదితరులు రూ.2 లక్షలు, కౌన్సిలర్లు తుమ్మగుంట శంకరరావు రూ.1లక్ష, కడగల వెంకటరమణ రూ.50 వేలు, దుప్పాడ పాపినాయుడు కుటుంబ సభ్యులు శ్లాబ్ నిర్మాణానికి, జల్లు నారాయణరావు ధ్వజస్తంభం ఏర్పాటుకు రూ.3 లక్షలు, పైల తౌడు రూ.25 వేలు, దుమ్మిద సింహాచలం, ముడిల సూర్యనారాయణ రూ.15 వేలు అందిస్తున్నట్లు ప్రకటించారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన, సహకరిస్తున్న, సహకరించేందుకు ఉత్సాహం చూపిస్తున్న వారందరికీ ధన్యవాదాలని ఆలయ కమిటీ సభ్యులు కిల్లారి మోహనరావు, ఎస్.రాంబాబు తెలిపారు.

జేవీకే కిట్ల పంపిణీకి వేళాయె..

- స్కూళ్ల పునః ప్రారంభం రోజునే అపూర్వ ఘట్టం
- కానుకలు అందుకోనున్న విద్యార్థులు 1,91,394
- మండల కేంద్రాలకు చేరిన కిట్లు



పంపిణీకి సిద్ధం చేసిన జేవీకే కిట్లు

నరసన్నపేట: విద్య కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. మనబడి నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చిన వైఎస్సార్ కాంగ్రెస్ సర్కార్.. అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతిదీవెన పథకాలతో విద్యార్థులకు అండగా నిలుస్తోంది. ఈ పథకాలతో పాటు జగనన్న విద్యా కానుకలను కూడా పిల్లలకు అందజేస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం రోజునే విద్యార్థులు అపురూప కానుకలు అందుకోనున్నారు. ఈ నెల 12వ తేదీన స్కూల్లో అడుగుపెట్టిన రోజునే ఎనిమిది రకాల వస్తువులతో కూడిన కిట్లను తీసుకోనున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దుతోంది. జిల్లాలో 2,653 పాఠశాలల్లో 1,91,394 మంది విద్యార్థులు చదువుతున్నారు.

8 రకాల వస్తువుల పంపిణీ

ప్రభుత్వ యాజమాన్యానికి సంబంధించి వివిధ పేర్లతో నడుపుతున్న విద్యాసంస్థల్లోను విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పేరుతో అభ్యాసన సామగ్రి వస్తువులు అందజేస్తున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరిన ప్రతి విద్యార్థికి చదువుకు అనవరమైన సామగ్రిని ఉచితంగా అందించేలా ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటుంది. జగనన్న విద్యాకానుకలో మూడు జతల యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, ఇంగ్లిషు డిక్షనరీ, బెల్ట్, బూట్లు, రెండు జతల సాక్సులు, బ్యాగ్‌ను అందజేస్తారు. జేవీకే కానుక నాణ్యత విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు.

జిల్లాలో జగనన్న విద్యా కానుక కిట్ల వివరాలు

సామగ్రి	ఇండెంట్	మంజూరు
బ్యాగ్స్	1,91,394	1,11,526
డిక్షనరీ (పిక్టోరియల్)	13,320	13,320
నోట్‌బుక్స్	11,65,038	11,64,518
షూస్	1,90,988	1,51,304
యూనిఫాం	1,91,394	1,91,086
టెక్ట్స్‌బుక్స్	16,06,338	10,69,553
వర్క్‌బుక్స్	1,27,628	93,928

పంపిణీకి ఏర్పాట్లు



ఈ నెల 12వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభమవుతున్నాయి. విద్యార్థులు పాఠశాలలకు వచ్చిన మొదటిరోజునే జేవీకే కిట్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశాం. 30 స్టాక్ పాయింట్లకు కిట్లను చేరవేశాం. అక్కడ నుంచి పాఠశాలలకు తరలించి విద్యార్థులకు పంపిణీ చేస్తాం. విద్యాకానుక నాణ్యతగా ఉండేలా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంది.

–రోణంకి జయప్రకాష్, ఏపీఓ, సర్వశిక్షా, శ్రీకాకుళం

ఆదర్శనీయులు 'బొడ్డేపల్లి'

- తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి
- బీఆర్ఏయూలో రాజగోపాలరావు శత జయంతి వేడుకలు



మాట్లాడుతున్న తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: బొడ్డేపల్లి రాజగోపాలరావు నేటి తరం రాజకీయ నాయకులకు ఆదర్శనీయులని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సెమినార్ హాల్లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో చాలామంది నాయకులు పాలన సాగిస్తారని.. వారిలో కొందరు మాత్రమే ప్రజల మనస్సుల్లో నిలిచిపోతారన్నారు. ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేతగా రాజగోపాలరావును అభివర్ణించారు. నిజాయితీగా ప్రాంతీయ అభివృద్ధికి, వెనుకబడిన ప్రజల ప్రగతికి కృషి చేశారని కొనియాడారు. రాజగోపాలరావు ఆశయ సాధన కోసం నాయకులు కృషి చేయాన్నారు.

- విజయనగరం జిల్లా సెషన్స్ జడ్జి బి.సాయికల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ.. రాజగోపాలరావు నిరంతరం ప్రజా ప్రయోజనాల కోసం పనిచేశారని గుర్తు చేశారు. విజన్‌తో అనాటి నాయకులు పనిచేయటం వల్లే ప్రస్తుతం అనేక ప్రాంతాలు ప్రగతి సాధించాయన్నారు. జిల్లా ప్రగతికి చివరి వరకూ బొడ్డేపల్లి కృషి చేశారన్నారు.
- బీఆర్ఏయూ వీసీ నిమ్మ వెంకటరావు మాట్లాడుతూ.. నిజాయితీ, నిబద్ధత, నిస్వార్థం రాజగోపాలరావు సొంతమన్నారు. ఇటువంటి నాయకులను స్మరించుకోవటం, ఆదర్శంగా చేసుకోవటం అవసమన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ, ఆమదాలవలస మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి, రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు బిడ్డిక అడ్డయ్య, ఎస్.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

సివిల్స్ విజేత కల్యాణికి మంత్రి అభినందన



కల్యాణిని అభినందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధి వప్పంగి గ్రామానికి చెందిన సివిల్స్ విజేత చల్లా కల్యాణి మంత్రి ధర్మాన ప్రసాదరావును శనివారం పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను మంత్రి అభినందించారు. మారుమూల గ్రామంలో పుట్టి సివిల్స్‌లో 285వ ర్యాంక్ సాధించి జిల్లాకు పేరు తెచ్చారని కొనియాడారు. సామాన్యులకు చేరువగా ఉంటూ మరింత అత్యున్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ఈమెతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా రవికుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడ గుండ క్రిష్ణ, ఉమామహేశ్వరరావు ఉన్నారు.

సీఎం జగన్ రైతు పక్షపాతి

- నరసన్నపేట ఎమ్మెల్యే కృష్ణదాస్



మాట్లాడుతున్న కృష్ణదాస్

జలుమూరు: రైతు శ్రేయస్సే పరమావధిగా భావించి రైతులకు పూర్తిస్థాయి మద్దతుతోపాటు వారికి అన్ని రకాల పంటలకు మార్కెటింగ్ సదుపాయం, ఇతర మౌలిక వసతుల కల్పనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. టిక్కలిపాడులో రూ.18 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు బాగుంటే ప్రజలు బాగుంటారన్న ఉద్దేశంతో ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు సమకూర్చుతున్నామన్నారు. వీటితోపాటు పండించిన పంటకు మద్దతు ధర, సాంకేతిక, యంత్ర పరికరాలను రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, అల్లాడ, చల్లవానిపేట సొసైటీ అధ్యక్షులు ఎం.శ్యామలరావు, పి.రాజప్పలనాయుడు, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, ఏవో కె.సురేష్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, సర్పంచ్ ధర్మాన నీలవేణి, ఎంపీటీసీ సభ్యుడు బండి ఎర్రన్న, సర్పంచ్‌లు బుడ్డల శ్రీను, జుత్తు నేతాజీ, కూర్మారావు పాల్గొన్నారు.

పైలట్ ప్రాజెక్ట్‌కు మట్టి నమూనాల సేకరణ



వల్లాడ గ్రామంలో సేకరించిన మట్టి నమూనాలు సేకరిస్తున్న జట్టు సంస్థ ప్రతినిధులు

గుమ్మలక్ష్మీపురం: పండ్ల తోటల్లో అంతర పంటల ద్వారా రైతులకు మరింత ఆదాయం చేకూర్చడమే లక్ష్యంగా జట్టు సంస్థ చేపట్టిన పైలట్ ప్రాజెక్ట్‌కు సంబంధించి, మట్టి నమూనాల సేకరణ ప్రారంభమైనట్లు సంస్థ కో-ఆర్డినేటర్లు జి.ప్రబోధ్, జి.మురళీమోహన్, గౌరినాయుడు తెలిపారు. మొదటి విడతలో మండలంలోని ఆర్.జమ్ము, పెంగవ, గొరడ, వల్లాడ గ్రామాల్లోని 40 మంది రైతులతో వారి తోటల్లో దేశీయ వరి, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి మొక్కలను అంతర పంటలుగా వేయడం జరుగుతుందన్నారు. నాబార్డు సహకారంతో మాతోట కార్యక్రమంలో భాగంగా పండ్ల తోటలు సాగు చేస్తున్న 500 మంది రైతుల తోటల్లో ఈ ప్రాజెక్ట్ అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం సేకరించిన మట్టి సారం అనుగుణంగా ఏయే నేలలో ఏయే రకం పంటలు, ఎరువులు వేయాలన్న అంశాలు సూచిస్తామన్నారు.

డీఆర్‌డీఓ పీడీ సందర్శన

భామిని: మండలంలోని మణిగ, కోసింగిగూడ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వన్‌ధన్ వికాస కేంద్రాలను పార్వతీపురం మన్యం జిల్లా డీఆర్‌డీఓ పీడీ కిరణ్ కుమార్ శనివారం సందర్శించారు. గిరిజన ప్రాంతాల్లోని అటవీ ఉత్పత్తుల నుంచి పలు వస్తువులు, పదార్థాల తయారీ, అమ్మకాలు చేసేందుకు అనువుగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలకు ఆర్థిక పరిపుష్టి కల్పించాలన్నారు. ఏదో ట్రయల్ రన్ కోసం కేంద్రాలను నడపకుండా ఏడాది పొడవునా వీటిని నిర్వహించి, అటవీ ఉత్పత్తుల ప్రాసెస్ జరిగేలా చూడాలని తెలిపారు. ఉన్నతి, స్త్రీనిధి రుణాల ద్వారా ఆర్థిక చేయూత అందివ్వాలని వెలుగు ఏపీఓ భవానీకి సూచించారు. అనంతరం జీడిపప్పు, కొండచీపుళ్ల తయారీని పరిశీలించారు.

పూరిల్లు దగ్ధం

బూర్జ: ఉప్పినివలస గ్రామంలో శుక్రవారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో పుచ్చ చిట్టెమ్మకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. చిట్టెమ్మ వేరే ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఆమెకు చెందిన మరో ఇంట్లో మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు చూసి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు. దుస్తులు, ధాన్యం, బియ్యం వంట సామగ్రి కాలిపోవడంతో బాధితురాలు కట్టుబట్టలతో మిగిలింది. గ్రామానికి చెందిన విశ్వేశ్వరాయ సేవా సంఘం ప్రెసిడెంటు కటకం రాజేశ్వరరావు, రెవెన్యూ అధికారులు బాధితురాలిని పరామర్శించారు.

హోరాహోరీగా బాక్సింగ్ పోటీలు

విజయవాడ స్పోర్ట్స్: ఐదోవ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల బాక్సింగ్ పోటీలు విజయవాడ ఆంధ్రా లయోల కాలేజీలో శనివారం హోరాహోరీగా జరిగాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల బాలికల విభాగంలో 60 పాయింట్లు, 10 గోల్డ్ మెడల్స్‌తో విశాఖపట్నం జిల్లా మొదటి స్థానంలో, 18 పాయింట్లు, రెండు గోల్డ్, రెండు సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్‌తో నెల్లూరు జిల్లా రెండో స్థానాన్ని దక్కించుకుంది. బాలుర విభాగంలోనూ విశాఖపట్నం జిల్లా 42 పాయింట్లు, ఏడు గోల్డ్ మెడల్స్‌తో మొదటి స్థానంలో నిలవగా, శ్రీకాకుళం జిల్లా 24 పాయింట్లు, నాలుగు గోల్డ్ మెడల్స్‌లో రెండో స్థానాన్ని దక్కించుకుంది. బాలికల విభాగంలో బెస్ట్ బాక్సర్‌లు ఎస్.దుర్గాస్మృతిశ్రీ (విశాఖపట్నం), ఎ.నసీమ (శ్రీకాకుళం), బాలుర విభాగంలో బెస్ట్ బాక్సర్‌లుగా పి.సుబ్రహ్మణ్యం (విశాఖపట్నం), డి.ప్రవీణ్ (శ్రీకాకుళం) నిలిచారు. విజేతలకు ఎన్టీఆర్ జిల్లా ట్రాఫిక్ ఏసీపీ ఎస్.సురేష్‌కుమార్‌రెడ్డి, సెంట్రల్ ఏసీపీ పి.భాస్కరరావు, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కె.పురుషోత్తం, సీఈవో శశికాంత్, ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మణ్‌దేవ్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వై.వి.ఎస్. ఉమామహేశ్వరరావు ట్రోఫీలు అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



పొందూరు: అలమాజీపేట సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని (56) రైతులు శనివారం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏఎస్సై రామచంద్రరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఎండలకు మృతదేహం నల్లగా మారిపోయింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

నేత్రదానాన్ని సంప్రదాయంగా భావించాలి

- జిల్లా అంధత్వ నివారణ సంస్థ పీఎం త్రినాథరావు



నేత్రదానంపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నేత్రదానాన్ని సంప్రదాయంగా భావించాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ కె.త్రినాథరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని మగటపల్లి కల్యాణ నేత్ర సేకరణ కేంద్రం వద్ద ప్రపంచ నేత్రదాన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పారామెడికల్ అప్తాల్మిక్ అధికారులతో నేత్రదానంపై ర్యాలీలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, అవగాహన సదస్సులు నిర్వహించడం ద్వారా నేత్రదాన ఆవశ్యకతను ప్రజల్లో పెంపొందిస్తున్నామన్నారు. నేత్రదానంపై మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 416 మంది వద్ద కార్నియాలను సేకరించి 831 మందికి వాటిని అమర్చి వెలుగును ప్రసాదించామన్నారు. తాము సేకరించిన కార్నికాయలను విశాఖలోని డాక్టర్ ఎల్.వి.ప్రసాద్ మోసిస్ నేత్ర నిధికి పంపించి నల్ల గుడ్డుపై పొర (కార్నియా) మార్పిడి ద్వారా చూపులు ప్రసాదించడం జరిగిందని వివరించారు. అలాగే 13 వేల మంది తమ నేత్రదానం కోసం ఒప్పంద పత్రాలు అందజేసినట్టు పేర్కొన్నారు. జిల్లాలోని జూనియర్, యూత్ రెడ్‌క్రాస్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రజల్లో నేత్రదానంపై అవగాహన కల్పించి చైతన్యపరుస్తున్నామన్నారు. నేత్రదానం చేయదలచిన వారు 08942-226555, 78426 99321 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా నేత్రదానంపై ప్రతిజ్ఞ చేశారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- డీపీటీవో విజయ్‌కుమార్



సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఇస్తున్న హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణను ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ అన్నారు. శ్రీకాకుళంలోని రోడ్డు రవాణా సంస్థకు చెందిన హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 12వ బ్యాచ్ అభ్యర్థులకు సర్టిఫికెట్లను శనివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు 200 మందికి డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చామని వివరించారు. 13వ బ్యాచ్ శిక్షణను ఈ నెల రెండో వారంలో ప్రారంభిస్తామని వెల్లడించారు. డ్రైవింగ్‌లో 30 ఏళ్ల అనుభవం ఉన్న రీజనల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో 32 రోజులు ఇచ్చిన శిక్షణలో మెకానికల్ క్లాస్, యోగా, వ్యక్తిత్వ వికాసం, ప్రథమ చికిత్స, వాహనం విడిభాగాలపై అభ్యర్థులకు శిక్షణ ఇచ్చామన్నారు. కొన్ని రాష్ట్రాల్లో మహిళలు కూడా డ్రైవింగ్‌లో శిక్షణ తీసుకొని భారీ వాహనాలను నడుపుతున్నారన్నారు. మన రాష్ట్రంలో కూడా శ్రీకాకుళం డ్రైవింగ్ స్కూల్‌తో పాటు మిగతా జిల్లాల్లో కొందరు మహిళల శిక్షణ తీసుకున్నట్టు పేర్కొన్నారు. మహిళలు శిక్షణ తీసుకోవడం వలన రాబోయే రోజుల్లో ఆర్టీసీలో డ్రైవర్లుగా ఉద్యోగాల్లో స్థిరపడే అవకాశం ఉందన్నారు. డ్రైవింగ్‌లో శిక్షణ తీసుకోవాలని ఆసక్తి ఉన్నవారు శ్రీకాకుళం జిల్లా మేనేజర్ ఆఫీసులోగానీ.. లేదా 99630 91999 నంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో హెవీ వెహికల్ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ వర్మ ఉన్నారు.

జీడికి మద్దతు ధర కల్పించాలి



మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

- వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలకు మంత్రి సీదిరి విజ్ఞప్తి

కాశీబుగ్గ: ఉద్దాన జీడి రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. జీఎంఆ కాలనీలోని మంత్రి స్వగృహంలో పారిశ్రామిక వేత్తలు, జీడి వ్యాపారులు, ప్రజాసంఘ నాయకులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీడి పిక్కల మద్దతు ధర కోసం కొన్ని రోజులుగా ఉద్దానం రైతులు, రైతు సంఘాల పోరాటానికి మద్దతుగా జీడి ఉత్పత్తిదారుల సంఘాలతో సమావేశమయ్యామన్నారు. వ్యాపారస్తులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి ఈ ఏడాది కనీస మద్దతు ధర రూ.10 వేలు కల్పించాలని ఆదేశించారు. రైతుల తరఫున మంత్రిగా మద్దతు తెలుపుతున్నామన్నారు. వ్యాపార వర్గాలు సానుకూలంగా స్పందిస్తూ మరోసారి వ్యాపారులంతా సమావేశం ఏర్పాటు చేసుకొని జీడి రైతులతో పాటు, రైతు సంఘాలతో కలిసి మాట్లాడదామని మాటిచ్చారని అన్నారు. కనీసం మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకుంటామని ప్రజా సంఘాలకు మంత్రి హామీ ఇచ్చారు. ఇటు రైతులు, రైతు సంఘాలు, మంత్రి హామీపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో పలాస కాష్యూ మాన్యుఫ్యాక్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ అధ్యక్షుడు మల్లా రామేశ్వరం, ఏఎంసీ చైర్మన్ పి.వి.సతీష్, ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ఆలయాల నిర్మాణం

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



సామరెల్లిలో రామాలయం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: గిరిజన గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి తెలిపారు. మండలంలోని పత్తికగూడ గ్రామంలో నీలమ్మతల్లి ఆలయం, సామరెల్లి గ్రామంలో రామాలయం నిర్మాణాలకు ఆమె శనివారం భూమిపూజ చేశారు. టీటీడీ(తిరుమల తిరుపతి దేవస్థానం) ఆధ్వర్యంలో జరిగే ఈ ఆలయాల నిర్మాణానికి సంబంధించి, ఒక్కో నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. పాలకొండ నియోజకవర్గం పరిధిలోని ఏ గ్రామంలోనైనా ఆలయాలు నిర్మించాలనుకుంటే తన కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.


వాహన తనిఖీలు

భామిని: మండలంలోని లివిరి గ్రామ కూడలిలో పోలీసులు శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. బత్తిలి ఎస్ఐ యతిరాజుల అమ్మనరావు ఆధ్వర్యంలో సిబ్బంది వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఇన్సూరెన్స్, ఆర్‌సీ బుక్‌లను పరిశీలించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు వివరించి, రోడ్డు ప్రమాదాల నివారణకు తోడ్పడాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తెలిపారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు (ఇన్‌సెట్లో)



కృష్ణ (ఫైల్)

నరసన్నపేట: మడపాం పంచాయతీ కొత్తపేట గ్రామానికి చెందిన తోట కృష్ణ (35) అనుమానాస్పదంగా మృతి చెందారు. ఈయన మృతదేహం మేజరు పంచాయతీ నరసన్నపేట మారుతీనగర్-1లోని సాయి మందిరం వద్ద పోలీసులు గుర్తించారు. కృష్ణ మృతికి స్పష్టమైన కారణాల కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇతని కుటుంబ సభ్యులు మాత్రం ఇది హత్యేనని ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఎవరో మృతి చెంది ఉన్నట్లు పోలీసులకు శనివారం ఉదయం సమాచారం వచ్చింది. వెంటనే ఎస్ఐ వై.సింహాచలం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఫోను లభించడంతో దాని ద్వారా మృతుని ఆచూకీ తెలుసుకున్నారు. కొత్తపేటకు చెందిన తోట కృష్ణగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో తండ్రి లక్ష్మీనారాయణ, తల్లి సాయమ్మలు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని గుర్తు పట్టారు. కొడుకు మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోదించారు. మహిళపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమెనే తమ కుమారుడు కృష్ణను హత్య చేసి ఉంటుందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొంతకాలంగా కృష్ణ నరసన్నపేట మారుతీనగర్ ప్రాంతానికి చెందిన వివాహితతో చనువుగా ఉంటున్నారు. వీరిద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలు కూడా ఉన్నట్లు సమాచారం. ఇదే ఆయన మృతికి కారణమై ఉంటుందని భావిస్తున్నారు. కృష్ణ శుక్రవారం సాయంత్రం పని ఉందని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడని.. రాత్రికి రాలేదని, ఉదయానికే పోలీసులు ఫోను చేస్తే తెలిసిందని మృతుని తండ్రి లక్ష్మీనారాయణ విలేకరులకు తెలిపారు. కృష్ణ గతంలో ఆటో నడిపే వాడని.. ప్రస్తుతం టోల్‌గేట్‌లో పని చేస్తున్నట్లు చెప్పారు. 2017లో ఈదులవలసకు చెందిన హారికతో కృష్ణకు వివాహమైంది. ప్రస్తుతం ఎనిమిది నెలల గర్భిణి. వారం క్రితమే సీమంతం చేశారు. కాగా వివాహిత ఇంటి వెనుక భాగంలో మృతదేహం లభించడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మేడ పైనుంచి దూకడం వల్ల మృతి చెందాడా.. లేదా వివాహిత ఇంట్లో వాళ్లు ఏదో చేసి కిందకు పడేశారా అనే అనుమానాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ బాలచంద్రరెడ్డి, సీఐ డి.రాములు పరిశీలించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.